క్లుప్తంగా

పచ్చిరొట్టతో భూసారం పెంపు


సుధాకర్, ఏఓ

మల్హర్: పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ మంగళవారం తెలిపారు. వరి, మిర్చి పంట సాగు చేసే రైతులు తప్పని సరిగా పచ్చిరొట్ట విత్తనాలను తొలకరిలో దుక్కి, దున్ని చల్లుకోవాలన్నారు. 45 రోజుల తర్వాత పూత దశలో భూమిలో కలియదున్ను కోవడంతో భూమి సారవంతం కావడమే కాక దిగుబడి పెరుగుతుందని తెలిపారు. రాబోవు వానకాలంలో2024 సీజన్‌కు గాను రాయితీపై 90 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తాడిచర్ల సహకార కేంద్రం, కొయ్యూరు ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం వేదమంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు, యాగ్నికులు వీరవెల్లి వేణుగోపాలచార్యులు అంకురారోహణం, విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధన్ పూజ నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం, గరుడ పటం ఎగురవేసి గరుడ ముద్ర ప్రసాదం అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, కృపాకర్‌రెడ్డి, దిడ్డి రమేశ్, కాంబత్తుల ప్రకాశ్, గన్ను వేణుగోపాల్, అనుకారి అశోక్, గొట్టిముక్కుల చంద్రప్రకాశ్, మహిళలు పాల్గొన్నారు.


విద్యార్థుల పక్షమై గళాన్ని వినిపిస్తా..

భూపాలపల్లి రూరల్: వరంగల్–ఖమ్మం–నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 51నంబర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపిస్తే విద్యార్థుల పక్షాన తన గళాన్ని వినిపిస్తానని ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి గుగులోత్ సంతోష్ నాయక్ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి మాట్లాడారు. సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్య సురేష్ నాయక్, జిల్లా సలహాదారుడు కొర్ర రఘురాం, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ వాలు, సేవలాల్ విద్యార్థి సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ మహేశ్వర్, అధిష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడుతా..

భూపాలపల్లి రూరల్: నల్గొండ–ఖమ్మం–వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలని, విద్యరంగ సమస్యలపై పోరాడుతానని ఎస్‌హెచ్‌ఆర్‌సీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పూజరిసత్యనారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకుల సమావేశంలో అభ్యర్థి సత్యనారాయణ ఎమ్మెల్సీ బ్యాలెట్ మాదిరి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సామాన్య వ్యక్తిని, విద్యావేత్తను ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని ఆశీర్వదించి మండలి సభకు పంపించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఆర్‌సీ నాయకులు రాష్ట్ర ఈసీ మెంబర్ తోట రాజయ్య, జిల్లా అధ్యక్షుడు దుంద్ర కుమార్, జిల్లాప్రధాన కార్యదర్శి శీలపాక నరేష్, అర్బన్ ఉపాధ్యక్షుడు ఇప్పకాయల రాధాకృష్ణ, మండల కమిటీ నాయకులు తాటికొండ రాకేష్, హన్మకొండ జిల్లా కార్యదర్శి ఉచ్చుత శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడి మృతి


సుదర్శన్‌రెడ్డి(ఫైల్)

టేకుమట్ల: మండలంలోని గుమ్మడివెల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నల్ల సురేందర్‌రెడ్డి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఉపాధ్యాయుడిగా మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో వృత్తిని ప్రారంభించి అనంతరం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చారు. మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేపించిన ఘనత ఆయనదే. నేడు ప్రధానోపాధ్యాయుడు నల్ల సురేందర్‌రెడ్డి భౌతికంగా లేకపోయినా ఆయన జ్ఞాపకాలు ఉన్నత పాఠశాలలో సజీవ సాక్ష్యాలని పలువురు పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకుంటున్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో పని చేసి 2006లో మండలంలోని కుందనపల్లి ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందారు. మంగళవారం ఆయన స్వస్థలమైన గుమ్మడవెల్లిలో జరిగిన అంత్యక్రియల్లో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కన్నీటి పర్యాంతమయ్యారు.

కూరగాయల సాగుతో లాభాలు

- సేంద్రియ పద్ధతిలో యువ రైతు వ్యవసాయం


కిరణ్ సాగు చేస్తున్న కూరగాయల పంటలు


పండించిన సొరకాయను చూపిస్తున్న కిరణ్


టమాటలు తెంపుతూ..

టేకుమట్ల: ఉద్యోగం కన్నా వ్యవసాయం మిన్న అంటూ మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన ఒజ్జల కిరణ్ అనే యువకుడు బీ ఫార్మసీ పూర్తి చేసి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ లాభాలు గడిస్తున్నాడు. పత్తి, మిరప పంటలతో పాటు కూరగాయాలైన టమాట, వంకాయ, బెండకాయ, పాలకూర, ఉల్లిగడ్డ, కాకరకాయ, సోరకాయ వంటి పలు రకాల కూరగాయలను సాగు చేస్తూ అధిక లాభాలను గడిస్తున్నాడు. కిరణ్ బీ ఫార్మసీ పూర్తి చేసి ఉద్యోగం ఇష్టంలేక ఇంటి వద్దనే ఉంటూ సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు. అతడికి ఉన్న మూడెకరాల భూమిలో రెండు ఎకరాల్లో పత్తి, మిరప పంటలతో పాటు, ఎకరం భూమిలో వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నాను. ఉద్యోగం చేస్తే తీవ్ర మానసిక ఒత్తిడితో పని వేలలు సైతం ఎక్కువగా కేటాయించాలి. అదే సొంతగా వ్యవసాయం చేస్తే ఏలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతు తెలుపుతున్నాడు. మార్కెట్ డిమాండ్‌ను బట్టి పంటలను వేస్తూ నెలకు రూ.30వేల వరకు సంపాదిస్తున్నాట్లు పేర్కొన్నాడు.

ఎమ్మెల్సీగా ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి


రేగొండ: ప్రచారం చేస్తున్న పాపయ్య


చిట్యాల: ప్రచారం చేస్తున్న నాయకులు

రేగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులను బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు తూర్పాటి మల్లేష్, కొడగాని రాకేష్, చల్ల విక్రమ్, కురాకుల మల్లయ్య, ఏరపాటి శివకృష్ణ, నరేందర్ రెడ్డి, ముత్యం పాల్గొన్నారు.

చిట్యాల: వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండ సురేష్, సాద సదానందం, మైదం శ్రీకాంత్, రాయిని శ్రీనివాస్, కెంసారపు ప్రభాకర్, చింతల రాజేందర్, లటికే స్వామి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఏటూరునాగారం : కాంగ్రెస్ పార్టీ బలపర్చిన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంత్రి సీతక్క, జిల్లా అధ్యక్షుడు అశోక్, బ్లాక్ అధ్యక్షుడు వెంకన్న ఆదేశాల మేరకు ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ముద్రించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టభద్రులు, ఉద్యోగులు మొదటి ఓటు తీన్మార్ మల్లన్నకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయూబ్, ఖలీల్, ఎల్లయ్య, లాలయ్య, రవి, నర్సయ్య, నవీన్, లక్కి, శ్రీను, హరికృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఏటూరునాగారం : ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీదే అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎల్లయ్య, ఖలీల్, ఆయూబ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు


రైతు నేస్తం కార్యక్రమంలో అధికారులు, రైతులు

రేగొండ: రైతులు వరి కొయ్యలను కాల్చొద్దని వరంగల్ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్త ఉమారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వరంగల్ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. వరంగల్ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సతీష్‌చంద్ర, ఉమారెడ్డి వరిలో కొత్తగా విడుదలైన వరంగల్ వరి, తెలంగాణ వరి–8 రకాలు, వరి కొయ్యలు కాల్చుతుండటంతో కలిగే నష్టాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, భూపాలపల్లి ఏడీఏ నర్సింగం, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు రూరల్ : మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన ల్యాద రాజయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్ పరామర్శించారు. ఈ మేరకు మంగళవారం రాజయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ చాంద్‌పాషా, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, కంబాల రవి, ల్యాద శ్యాంరావు, గోల్కొండ రవి, అజ్జు తదితరులు ఉన్నారు.

మల్హర్‌లో..

మల్హర్: మండలంలోని చిన్నతూండ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ కాటారం మండలంలో మేడిపల్లి వద్ద సోమవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మండల రాహుల్ మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య వివరాలను ఆస్పత్రి సూపరిటెండెంట్‌ను అడిగి తెలుకున్నారు. సర్జరీ నిమిత్తం అతడి రక్తాన్ని ఆస్పత్రిలో ఇచ్చాడు.

ఇసుక లోడింగ్ పని కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

వాజేడు : మండలంలో చేపట్టిన సొసైటీ ఇసుక క్వారీల్లో లోడింగ్ పనులు కల్పించాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు గుగ్గిళ్ల దేవయ్య, బచ్చలి కృష్ణబాబు కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో జరిగిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయం నష్టాల బారిన పడవేయడంతో పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారిందన్నారు. క్వారీల పరిధిలోని గ్రామాల ప్రజలతో పాటు మండలంలోని ఇతర గ్రామాల కూలీలకు, ట్రాక్టర్ యజమానులకు, డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. భారీ యంత్రాలతో ఇసుకను డంప్ చేయడం మూలంగా ఈ ప్రాంత పేదలు ఉపాధిని కోల్పోతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

గీతకార్మికుడికి గాయాలు


గాయాలపాలైన వెంకటేశం

కాటారం: తాటి చెట్టు పైనుంచి ప్రమాదావశాత్తు కిందపడి ఓ గీతకార్మికుడికి తీవ్రగాయాలపాలైన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని ధన్వాడలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్రి వెంకటేశం అనే గీతకార్మికుడు తాటి చెట్టు ఎక్కుతుండగా మోకుజారి కిందపడిపోయాడు. దీంతో వెంకటేశం తల భాగంలో తీవ్రగాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఎంజీఎంకు తీసుకెళ్లినట్లు తెలిసింది.

గిరిజన చట్టాలను అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏజెన్సీలో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ.. గిరిజన చట్టాలకు విరుద్ధంగా వలస గిరిజనేతరులు ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోని అక్రమ నిర్మాణాల చేపడుతున్నారని ఆరోపించారు. గిరిజన చట్టాలను అమలు చేయటంలో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం ప్రతాప్, పూనెం మునేశ్వరావు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న నిర్వాహకులు

చిట్యాల: మండంలోని చైన్‌పాక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రేణుకుంట్ల స్వరూప భర్త రేణుకుంట్ల సదానందం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మంగళవారం భూపాలపల్లి సంఘమిత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాకులు గుర్రపు రవీందర్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడం కోసం ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే మృతుడి కుమార్తె శ్రావ్య సంఘమిత్ర కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతుందని, ఆమె ఉన్నత చదువులకు తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎలుగూరి హరికృష్ణ, లేక్చరర్‌లు మొగిలి, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డి గెలుపునకు కృషిచేయండి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

ఏటూరునాగారం : బీఆర్‌ఎస్ పార్టీ బలపర్చిన వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆపార్టీ సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్న తప్పుడు ఆరోపణలతో కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూ తెలంగాణ యువతను, ఉద్యోగస్తులను, సబండ వర్గాలను మాయమాటలు ప్రచారం చేశాడన్నారు. తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓటమికి కారణమయ్యాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి, చింతపండు నవీన్ తోడైతే వారి దోపిడీకి అంతం ఉండదని తెలిపారు. విజ్ఞానులైన పట్టభద్రులు ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరూ ఆలోచించి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించి శాసన మండలికి పంపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కమిటీ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, నాయకులు ఖాజాపాషా, వావిలాల రాంబాబు, కుమ్మరి చంద్రబాబు, ధన్నపునేని కిరణ్, కోట నర్సింహులు, ఇట్టెం నాగరాజు, బోడ శంకర్, మాదరి రాంబాబు, పాలకుర్తి దేవేందర్, మహేశ్వర్, చిన్ని, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్లను నియమించాలి

వాజేడు : ఏజెన్సీలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో విద్యావలంటీర్లను నియమించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఇరుప బాలాజీ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాతూ ఉపాధ్యాయుల కొరత కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో విద్యార్థులకు చదువు అందని ద్రాక్షగా మారిందన్నారు. సాధారణ ఉపాధ్యాయుడు వాజేడు, వెంకటాపురం(కె) మండలాల విద్యా సంస్థలను పర్యవేక్షించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకుడు సురేష్, హనుమంతు, సంతోష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు


ములుగు రూరల్: తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు


వాజేడు: షాపులో తనిఖీ చేస్తున్న ఎస్సై, ఏఈఓ


వెంకటాపురం(కె): విత్తన షాపుల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె) : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెంకటాపురం సీఐ బండారి కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండలంలో వ్యవసాయ, పోలీస్ శాఖలు సంయుక్తంగా విత్తనాల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లోని స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై అశోక్, ఏటూరునాగారం ఏడీఏ శ్రీధర్, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు తదితరులు ఉన్నారు.

విత్తన షాపుల తనిఖీ

వాజేడు : అన్నదాతలకు నకిలీ విత్తనాలు విక్రయించే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేరూరు ఎస్సై రమేశ్ తెలిపారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలోని విత్తన షాపుల్లో మంగళవారం జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ఏఈఓ హరీశ్‌తో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లో తనిఖీ సమయంలో ఎలాంటి నకిలీ విత్తనాలు లభించలేదని పేర్కొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

ములుగు రూరల్ : రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని మండల వ్యవసాయ అధికారి మునుకుంట్ల సంతోష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై లక్ష్మారెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో ఉన్న విత్తనాలు వాటి కంపెనీ వివరాలు నమోదు చేసుకున్నారు. అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలను సేకరించారు. విత్తనాలు అమ్మినప్పుడు రైతులకు తప్పని సరిగా రశీదు అందించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే అమ్మాలని సూచించారు. ఈ తనిఖీలో వ్యవసాయ విస్తరణ అధికారి బొంతల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన వాసుదేవరెడ్డి


కేటీఆర్‌తో వాసుదేవరెడ్డి

భూపాలపల్లి రూరల్: హైదరబాద్‌లో బీఆర్‌ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్, న ల్గొండ, ఖమ్మం పట్టభద్రుల పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి పూర్తి సహకారం అందించాలని, సమష్టిగా పనిచేయాలని తనకు కేటీఆర్ సూచించినట్లు వా సుదేవరెడ్డి తెలిపారు. కేటీఆర్ ఆదేశాల మేరకు పట్ట భద్రుల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని అన్నారు.